# నేడే రంజాన్ పండుగ

- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 20, ప్రజాజ్యోతి:** పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. నెల రోజుల పాటు ఉపవాసాలు పాటించిన ముస్లింలు శుక్రవారం సాయంత్రం ఆకాశంలో షవ్వాల్ నెలవంక దర్శనమిచ్చిన నేపథ్యంలో, శనివారం

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 21 | మార్చి | 2026 • పేజీలు : 8



# యుద్ధం పేరుతో....

6 లో..

# గ్యాస్ మాయజాలం

• గ్యాస్ దొరక్క వ్యాపారులు విలవిల • గ్యాస్ కష్టాలు తీరేది ఎన్నడో? • గ్యాస్ కొరతతో మూతపడుతున్న వ్యాపారులు • ఇక కట్టెల పోయే ఆధారమంటూ కట్టెల పొయ్యికి సిద్ధమవుతున్న చిరు వ్యాపారులు • గ్యాస్ లేకపోతే వ్యాపారాలు సాగేదెలా? • వ్యాపారాలు మూతపడడంతో రోడ్డున పడుతున్న కూలీలు • ప్రభుత్వం వ్యాపారులకు కమర్షియల్ గ్యాస్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటున్న వ్యాపారులు • రేపటినుండి మూతపడనున్న చిరు వ్యాపారులు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లు • బుకింగ్ ద్వారా గృహాల నుండి గ్యాస్ దొరికితే 2000 పై మాటే • ఇక గ్యాస్ కు బై బై కట్టెల పొయ్యికి జై జై అంటున్నా వ్యాపారులు

### భద్రాచలంలో పెను విషాదం

# గోదావరిలో బీటెక్ విద్యార్థులు గల్లంతు

- ముగ్గురి మృతదేహాలు లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగింపు



**భద్రాచలం, మార్చి 20, ప్రజాజ్యోతి:** భద్రాచలం పరిధిలో గోదావరి నదిలో జరిగిన విషాద ఘటనలో బీటెక్ విద్యార్థులు గల్లంతవడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చిన యువకులు నదిలో స్నానాలకు దిగగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి ప్రాంతానికి చెందిన ఎస్ఆర్ఎంటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ స్నేహితులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి ఎటపాక మండలం పురుషోత్తమపట్నం గ్రామ శివారులోని కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీప గోదావరిలోకి దిగారు. ఈ సందర్భంగా ఫోటోలు తీసుకుంటూ ఉండగా ఏడుగురు యువకులు అకస్మాత్తుగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరికి ఈత రావడంతో

మిగతా 2 లో...

## భద్రగిరి మార్ట్ ఏర్పాట్లు వేగవంతం

- నిత్యావసర సరుకుల ప్యాకింగ్ పూర్తి చేయాలి : పీఓ బి. రాహుల్



**భద్రాచలం, మార్చి 20, ప్రజాజ్యోతి:** ఈ నెలలో ప్రారంభించనున్న భద్రగిరి మార్ట్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు సేకరించిన

మిగతా 2 లో...



7 లో..

# రియల్టర్ల అహంకారానికి హద్దులే లేవా...?

## భద్రగిరి మార్ట్ ఏర్పాట్లు వేగవంతం



(మొదటి పేజీ తరువాయి...)

నిత్యావసర సరుకులను ఆదివారం లోపు పూర్తిస్థాయిలో ప్యాకింగ్ చేసి మార్ట్‌లో ర్యాకుల వారీగా అమర్చాలని సూచించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రారంభోత్సవ తేదీ సమీపిస్తున్నందున పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఆర్గానిక్ రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా సేకరించిన పప్పుదినుసులు, తృణధాన్యాలు, గృహావసరాల ఆహార పదార్థాలన్నీ ఆదివారం లోపు సిద్ధం కావాలని తెలిపారు. వినియోగదారులకు అవసరమైన నిత్యావసర సరుకులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం ఎస్‌హెచ్‌జీ మహిళలు, ఆర్గానిక్ ఉత్పత్తుల సరఫరాదారులతో సమావేశమై, ఖమ్మంలో మహిళలు నిర్వహిస్తున్న మార్ట్‌ను ఆదర్శంగా తీసుకుని భద్రగిరి మార్ట్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. గిరిజన మహిళలు, రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ మార్ట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వారు తయారు చేసే ఉత్పత్తులతో పాటు సాధారణ వినియోగ నిత్యావసర సరుకులు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పప్పులు, పచ్చళ్ళు, బియ్యం, తినుబండారాలు తదితర వస్తువులు నాణ్యతతో సరఫరా చేయాలని, వినియోగదారులు సంతృప్తి చెందితేనే మార్ట్‌కు మంచి పేరు వస్తుందని చెప్పారు. ఎంపికైన మహిళా సంఘాలు, సరఫరాదారులు శనివారం లోపు సరుకులను అందజేయాలని సూచించారు. గిరిజనులకు ఆర్థికంగా దోహదపడేలా సేంద్రియ నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించేందుకు ఐటీడీఏ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వినియోగదారులు భద్రగిరి మార్ట్‌ను సందర్శించి కొనుగోలు చేయడం ద్వారా గిరిజన మహిళలకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఏపీవో పవర్ వేణు, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, పీవీటీజీ అధికారి గన్యా, ఏవో సున్నం రాంబాబు, డీఎం జీసీసీ సమ్మయ్య, ఏసీఎంఓ రమేష్, జేడీఎం హరికృష్ణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణతో పాటు ఇతర అధికారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## హోటళ్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు

- 24 గృహ వినియోగ సిలిండర్ల స్వాధీనం





**భద్రాచలం, మార్చి 20, ప్రజా జ్యోతి:** భద్రాచలం పట్టణంలో శుక్రవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు వివిధ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 24 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం, వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించాల్సిన కమర్షియల్ సిలిండర్ల స్థానంలో గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని భద్రతార్థం స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. ఈ సందర్భంగా భద్రాచలం తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డీటీ జి. రాజులు మాట్లాడుతూ, హోటళ్లు, టీ దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు గృహ వినియోగ సిలిండర్లను వినియోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో పౌర సరఫరాల శాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నేడే రంజాన్ పండుగ



(మొదటి పేజీ తరువాయి...)

ఈద్–ఉల్–ఫితర్ పండుగను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముస్లిం సోదరులు విస్తృతంగా ఏర్పాట్లు చేసుకున్నారు. మసీదులు, ఈద్గాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. ప్రత్యేక నమాజ్‌ల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### »» ఈద్-ఉల్-ఫితర్ అంటే...

నెల రోజుల ఉపవాస దీక్షలు పాటించిన అనంతరం షవ్వాల్ నెల మొదటి రోజున జరుపుకునే పండుగే ఈద్–ఉల్–ఫితర్. ఈ రోజున ముస్లింలు ఉదయాన్నే స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి, అత్తర్ పూసుకుని, కళ్లకు సుర్మా పెట్టుకుని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

పండుగ రోజున బంధువులు, స్నేహితులను ఇంటికి ఆహ్వానించి షీర్ ఖుర్మా (సేమియా)తో విందు ఏర్పాటు చేస్తారు. ఈ పండుగ ప్రేమ, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

### »» జకాత్ ప్రాముఖ్యత...

ఇస్లాం మతంలోని ముఖ్య సూత్రాల్లో జకాత్ ఒకటి. జకాత్ అనగా దానం. ఇది మానవుల్లో త్యాగం, సానుభూతి, సహకార భావాలను పెంపొందిస్తుంది. ప్రతి ముస్లిం తన సంపాదనలో నుంచి 2.5 శాతం పేదలకు దానం చేయాలి. బంగారం, వెండి, నగదు, పంటలు, వ్యాపార వస్తువులపై జకాత్ వర్తిస్తుంది. నిరుపేదలు కూడా ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నదే దీని ముఖ్య ఉద్దేశం.

### »» ప్రత్యేక తరావీ నమాజ్‌లు...

రంజాన్ మాసంలో ప్రతి రోజు రాత్రి ఇషా నమాజ్ అనంతరం తరావీ నమాజ్‌లు నిర్వహిస్తారు. సుమారు 20 రకాత్‌లతో జరిగే ఈ నమాజ్‌లలో హాఫీజ్‌లు ఖురాన్ పారాయణం చేస్తారు. లైలతుల్ ఖదర్ (శబె ఖదర్) రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

### »» ఫిత్రా దానం...

ఈద్ నమాజ్‌కు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. ఉపవాస సమయంలో తెలియక జరిగిన పొరపాట్లకు పరిహారంగా ఫిత్రా ఇవ్వాలని షరియత్ పేర్కొంటుంది. ప్రతి ముస్లిం తన సామర్థ్యానికి అనుగుణంగా గోధుమలు లేదా దానికి సమానమైన ధనాన్ని పేదలకు దానం చేయాలి.

### »» స్థోమత ఉన్నవారు తప్పనిసరిగా జకాత్ ఇవ్వాలి: జిందా. భద్రాచలం



ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ముస్లిం జకాత్ ఇవ్వడం తప్పనిసరి. తమ సంపాదనలో కొంత భాగాన్ని అవసరమైన వారికి పంచడం ద్వారా సమాజంలో సమానత్వం, సౌహార్దం పెరుగుతాయి

## భద్రాచలంలో పెను విషాదం










(మొదటి పేజీ తరువాయి...)

వారు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. వీరిలో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారని సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజఈతగాళ్లు, ప్రత్యేక రిస్క్యూ బృందాల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. గల్లంతైన వారిలో సాయంత్రం వరకు ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల్లో భద్రాచలం పట్టణానికి చెందిన చారుగుండ్ల శ్రీకర్, అభిరామ్, ఉయ్యూరుకు చెందిన నవదీప్‌గా గుర్తించారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో భద్రాచలం పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఉదయం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ దర్శనం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ విషాదం చోటుచేసుకోవడం మరింత కలచివేసింది. ప్రమాదం నుంచి బయటపడ్డ యువకులు తెలిపిన ప్రకారం, నదిలో సరదాగా స్నానం చేస్తూ, సెల్ఫీలు దిగుతున్న సమయంలో అకస్మాత్తుగా లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో ప్రవాహంలో కొట్టుకుపోయారని తెలిపారు. కళ్లముందే తమ స్నేహితులు మునిగిపోవడం చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యామని వారు విలపించారు. ఇటీవల కొల్లిగూడెం ప్రాంతంలో ఇసుక తవ్వకాల కారణంగా గోదావరి నది లోతు మారిపోయిందని, సరైన అవగాహన లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఠాను నాయక్ కు ఘన నివాళులు




**కొత్తగూడెం, మార్చి 20 (ప్రజాజ్యోతి):** భూమి, భుక్తి, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం రజాకార్లకు ధైర్యంగా ఎదురొడ్డి పోరాడి ప్రాణ త్యాగం చేసిన అమరవీరుడు జాటోత్ టాను నాయక్ అమరత్వానికి 77 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గిరిజన లంబాడీల ఐక్య సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ బంజారా వీరుడు ఠాను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాల వల్లనే నేడు ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. గిరిజన లంబాడి బిడ్డగా జన్మించిన టాను నాయక్ వీరోచిత పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన లంబాడీల ఐక్య సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# అటవీ మధ్య విద్యార్థుల సందడి

- ప్రకృతి వీక్షణతో అవగాహన
- పిచ్చుకల, అటవీ, నీటి దినోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు
- ట్రెక్కింగ్ ద్వారా జీవ వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు
- ఎన్‌జీసీ, స్కౌట్స్ & గైడ్స్ ఆధ్వర్యంలో ప్రకృతి విహారం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 20, ప్రజా జ్యోతి:** అశ్వరావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం, మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవం, మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భాలను పురస్కరించుకొని పాఠశాల ఎన్‌జీసీ విద్యార్థులు మరియు భారత్ స్కౌట్స్ & గైడ్స్ ఆధ్వర్యంలో శాంతినగర్ నుండి రజబలి నగర్ వరకు ప్రకృతి విహారయాత్ర, ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ ట్రెక్కింగ్ క్యాంపును పెద్దిరెడ్డిగూడెం ఉపసర్పంచ్ వేముల నరేష్ శాంతినగర్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనందకుమార్ హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి సంపత్ కుమార్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, జిల్లా క్వాలిటీ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ నాగరాజశేఖర్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.మార్గమధ్యలో విద్యార్థులు పక్షులు, చెట్లు, సీతాకోక చిలుకలు, తడినేల జీవులను వీక్షిస్తూ అటవీ ప్రాంత జీవ వైవిధ్యంపై అవగాహన పొందారు. పాఠశాల గ్రీన్ కార్ప్స్ ఇంచార్జ ఉపాధ్యాయులు మోతుకూరి పద్మ, నునావత్ బాలు, భారత్ స్కౌట్స్ & గైడ్స్ జిల్లా జాయింట్ సెక్రటరీ నక్కా భారతమాత, గైడ్ కెప్టెన్ ఎలదండి శాంతకుమారి, స్కౌట్ మాస్టర్ బోడ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులను నాలుగు బృందాలుగా విభజించి కార్యక్రమం నిర్వహించారు.రజబలినగర్ చేరుకున్న విద్యార్థులకు గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. అక్కడ అటవీ ప్రాంతంలో విద్యార్థులు "నిధి అన్వేషణ" ఆటను నిర్వహించారు. అనంతరం ఎంఈఓ ఆనందకుమార్ మాట్లాడుతూ పిచ్చుకల ప్రాముఖ్యత, వాటి ఉనికికి ఎదురవుతున్న ప్రమాదాల గురించి వివరించారు. జిల్లా సైన్స్ అధికారి సంపత్ కుమార్ అడవులు పర్యావరణ సమతుల్యతకు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకర్ మహాదేవన్, ఉపాధ్యాయులు బాబురావు, సుశీల, మోతిలాల్, జయరాం, వసుంధర, శ్రీలత, బాబూలాల్, బాలకృష్ణ, శిరీష పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు : ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 20, ప్రజా జ్యోతి:** ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ సందేశం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం పవిత్రత, నియమ నిష్ఠలకు ప్రతీక అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఈ పవిత్ర మాసంలో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఎంతో గొప్పవని తెలిపారు. ఈ ఉపవాసాలను ఈద్–ఉల్–ఫితర్ పండుగతో ముగించుకుంటారని అన్నారు.రంజాన్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, శాంతి సామరస్యాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో సోదరభావం పెంపొందాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎస్పీ కోరుకున్నారు.

## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

- కాంగ్రెస్ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే సుభాని
- సామరస్యానికి, సుహృద్భావానికి ప్రతీకగా రంజాన్ పండుగ
- ముస్లిం సోదరుల ప్రార్థనలు సఫలం కావాలని ఆకాంక్ష



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 20, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల ముస్లిం సోదర సోదరీమణులకు కాంగ్రెస్ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే సుభాని రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం మానవాళికి సత్యం, సహనం, కరుణ, దాతృత్వం వంటి విలువలను బోధించే పవిత్ర కాలమని పేర్కొన్నారు.ఉపవాస దీక్షలు మనలో క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు పేదల పట్ల సహానుభూతి, దాతృత్వ భావాలను పెంచుతాయని తెలిపారు. సామూహిక ప్రార్థనలు సమాజంలో ఐకమత్యాన్ని బలపరుస్తాయని, పరస్పర గౌరవం పెంపొందిస్తాయని అన్నారు.అల్లాహ్ దయతో మండల ప్రజలందరికీ శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం మనిషిలోని చెడు భావనలను తొలగించి సత్సంకల్పాలను పెంపొందించే గొప్ప పండుగ అని ఆయన తన సందేశంలో తెలిపారు.రంజాన్ మాసంలో చేసే దానధర్మాలు సమాజంలో సమానత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. యువ త మంచి మార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ శాంతి, సహనం పాటిస్తూ పరస్పర ప్రేమాభిమానాలతో జీవించాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు.

## బంజారా వీరుడు ధాను నాయక్‌కు ఘన నివాళి

- పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం: మేయర్ గణేష్ నాయక్



**లక్ష్మీదేవిపల్లి, మార్చి 20 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన బంజారా వీరుడు జాటోత్ ధాను నాయక్ జీవిత గాథ ప్రతి ఒక్కరికి ఆదర్శమని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్ అన్నారు. ప్రజలను సంఘటితం చేసి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఆయన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ధాను నాయక్ 76వ వర్ధంతి సందర్భంగా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్‌నాయక్ పాల్గొని ధాను నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మాట్లాడుతూ 1948లో హైదరాబాద్ సంస్థానంలో జరిగిన పోలీస్ యాక్షన్ సమయంలో కులమతాలకు అతీతంగా ప్రజలను సంఘటితం చేసి పోరాటం సాగించారని గుర్తుచేశారు. ధర్మపురం తండాకు చెందిన ధాను నా యక్ కుటుంబం మొత్తం తెలంగాణ స్వరాజ్యం కోసం పోరాడిందని తెలిపారు. ఆయన తో పాటు ఆరుగురు సోదరులు కూడా రైతాంగ సాయుధ పోరాటంలో వీరమరణం పొందినట్టు పేర్కొన్నారు.బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ధాను నాయక్ స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**ఇల్లందు క్రాస్‌రోడ్‌లో ధాను నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలి: వీరు నాయక్ ....** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరమరణం పొందిన ధాను నాయక్ విగ్రహాన్ని లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లందు క్రాస్‌రోడ్ సెంటర్‌లో ఏర్పాటు చేయాలని జేఏసీ వైస్ చైర్మన్ వీరు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంజారాల హక్కుల సాధన కోసం అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అజ్మీరా లైలా, గుగులోత్ ప్రేమిందర్, హతీరాం, కార్పొరేటర్ సింధు తపస్వి, జేఏసీ గౌరవాధ్యక్షులు రమేష్‌రాథోడ్, బానోత్ రాములు, సాధులు గణేష్‌మహరాజ్, రాములు మహరాజ్, జేఏసీ ప్రధాన కార్యదర్శులు ధరావత్ కన్షీరామ్, మూడ్ జయరాం, కో–కన్వీనర్లు మాళోత్ శివ, గుగులోత్ చందర్ నాయక్, గుగులోత్ భద్రు, నూనావత్ రవి, బాలకృష్ణ, బాబులాల్, భరత్, నర్సింహా, హనుమంతు, సేవ్యా, బానోత్ ప్రసాద్, శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, మహిళా కో–కన్వీనర్ జానకి బాయి, రమేష్, బాలు, కిషన్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంత ముస్లిం అధికారులు, సిబ్బందికి రంజాన్ శుభాకాంక్షలు

- ఐటీడీఏ పీఓ బి. రాహుల్



**భద్రాచలం, మార్చి 20, ప్రజాజ్యోతి:** ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసి గిరిజన కుటుంబాలు, గిరిజన విద్యార్థులకు సేవలందిస్తున్న వివిధ శాఖల కార్యాలయాల్లో, ఐటీడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ముస్లిం అధికారులు, సిబ్బందికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం తన చాంబర్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, శనివారం జరుపుకునే రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ధనిక,బీద తేడా లేకుండా నెలరోజుల పాటు కఠిన ఉపవాసాలు పాటిస్తూ ఫిత్రా, జకాత్ వంటి ఆచారాలను నిర్వహించడం సమాజానికి ఆదర్శమని తెలిపారు.పేదల ఆకలి, కష్టాలను గుర్తు చేస్తూ తమ సంపాదనలో కొంత భాగాన్ని అవసరమైన వారికి పంచడం గొప్ప మనోభావమని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన శాంతి మార్గంలో నడిచి సమాజంలో సామరస్యాన్ని పెంపొందించాలని కోరారు.చివరగా మరొకసారి ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## రామయ్యను దర్శించుకున్న సమాచార హక్కు చట్టం కమీషనర్ పివి శ్రీనివాస్

**భద్రాచలం, మార్చి 20, ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శుక్రవారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ పి.వి. శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో పివి శ్రీనివాస్కు ఆలయ వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే దేవస్థానం తరపున జ్ఞాపికను, తీర్థ ప్రసాదాలను ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పట్టణ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.



## వాహనానికి నిప్పు పెట్టిన దుండగులు



**చర్ల, మార్చ్ 20:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గురువారం తేగడ గ్రామంలో గుర్తుతెలియని వారు ఇంటిముందు పార్కింగ్ చేసిన వాహనానికి నిప్పు పెట్టారు. తేగడ గ్రామానికి చెందిన భోది రెడ్డి. అశోక్ కుమార్ రెడ్డి ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు తగలబెట్టేరని లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని మా కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీయడం కోసమే ఈ ఘటనకు పాల్పడ్డారని ఈ ఘటనకు పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులను పోలీస్ శాఖ కఠినంగా శిక్షించాలని వాహనదారుడు అశోక్ కుమార్ రెడ్డి పోలీస్ శాఖను కోరుకున్నారు.

## లేబర్ కోడ్ ల అమలుతో సంక్షేమ బోర్డు తూట్లు

- బీసీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు



**భద్రాచలం, మార్చి 20, ప్రజాజ్యోతి:** కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల అమలుతో భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు తూట్లు పడుతున్నాయని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు ఆరోపించారు. భద్రాచలంలో చాంబర్ ఆఫ్ కామర్స్ భవన్ లో మూడు రోజులు పాటు జరగనున్న రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణా తరగతులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే జీవో నెంబర్ 12 ను సవరించాలని డిమాండ్ చేశారు. సిఎస్ సి హెల్త్ టెస్టులను రద్దుచేసి సంక్షేమ బోర్డు ద్వారా ప్రతి కార్మికుడికి హెల్త్ కార్డు ఇవ్వాలని 60 సంవత్సరాల వయస్సు నిండిన కార్మికులకు ప్రతినెల రూ.3000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ , తమిళనాడు ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధంగా కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ సొంత ఇంటి నిర్మాణానికి నిధులు సమకూర్చాలన్నారు. రాష్ట్రంలో నిర్మాణ రంగ సంక్షేమ బోర్డుకు కార్మిక సంఘాల తోటి సలహా మండలి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి క్లాసులలో భాగంగా బదిలీ రోజు వర్తమాన రాజకీయాలు కార్మిక వర్గం పై ప్రభావం అనే అంశంపై ఏజే రమేష్ బోధించారు. ప్రధాని మోదీ సర్కార్ పేద ప్రజలు, కార్మిక వర్గంపై భారాలను వేయటం ప్రారంభించిందని ఆరోపించారు. మోదీ అనుసరించిన అమెరికా అనుకూల విధానాల వల్లే ఈరోజు గ్యాస్, పెట్రోలియం కొరతలు భారతదేశంలో ప్రారంభమైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎంబి నర్సారెడ్డి జిల్లా సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ జి పద్మ, ఎర్రంశెట్టి వెంకట రామారావు, నకిరికంటి నాగరాజు, సుధాకర్, అప్పారావు, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి నిజరూప దర్శనం



**చర్ల, మార్చ్ 20(ప్రజా జ్యోతి)**:చర్ల మండలంలోని తేగడ గ్రామంలో పురాతన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారు నిజరూప దర్శన కార్యక్రమం నిర్వహించారు . గురువారం తేగడ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దేవాలయంలో ఉదయం 4 గంటల నుండి ఆలయ శుద్ధి కార్యక్రమాలు 7 గంటల నుండి శివ పరివార దేవతలు అందరికీ విశేష రుద్రాభిషేకాలు పట్టు వస్త్ర అలంకరణ జరిగింది. తదుపరి 10 గంటల నుండి మహా గణపతి పూజ. సుబ్రహ్మణ్య స్వామి వారికి అష్టోత్తర శత నామ అర్చన వీరేశ్వర స్వామి కి విశేష లఘు న్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది.పురాతన మూర్తికి ఒక అజ్ఞాత భక్తురాలు గంగ యమున సరస్వతీ త్రివేణీ సంగమం నుండి లింగాల గోదావరి జలాలు తో పురాతన మూర్తికి విశేష రుద్రాభిషేకం జరిగింది .మూడు రోజుల పాటు అఖండ దీప సాక్షిగా స్వామి వారు నిజ రూపంలో కొలువు తీరి ఉండనున్నారు.ఈ కార్యక్రమం లో అతి పురాతన మహా మహి మాన్విత భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దర్శనము కోసం తే గడ గ్రామం తో పాటు చుట్టు పక్క ల గ్రామాల వారు కూడా దర్శనం కోసం తరలి వచ్చారు.రాత్రి 7 గంటల కు ఆలయ నిర్వాహకులు. యల్లమందల.శ్రావణ కుమార్ ఆద్వర్యంలో అర్చకులు భాను ప్రకాష్.పంచాంగ శ్రవణము చేసారు..ఈ కార్యక్రమంలో యల్లమందల.శివ ప్రతాప్,నాగేంద్రయ్య,ప్రవీణ్ కుమార్,చక్రవర్తి,జగదీష్ ,నాగవేణి ,భవానీ,సోమేశ్వరి, జ్యోత్స్న రమణి, జోష్నా లక్ష్మీ శ్రీ,అభినవ్, భావన.పేకేటి సుబ్బారావు,మాధురి,సాయి శృతి,విద్య శ్రీ మద్ది.భాస్కర్ రెడ్డి. ఆలవాల పార్వతీ,పంచాయతీ సర్పంచ్ జమ్ముల మురళి ఉప సర్పంచ్ పాగా.రాంప్రసాద్ తదితరుల భక్తులు పాల్గొన్నారు.

# బట్టిగూడలో సీఆర్పీఎఫ్ ఉచిత వైద్య శిబిరం




**చర్ల, మార్చ్ 20:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో గురువారం 87వ సీఆర్పీఎఫ్ దినోత్సవం సందర్భంగా, బట్టిగూడ గ్రామంలో షాలిన్, ఐజీ సీజీ సెక్టార్, రాజేష్ పాండే, డీఐజీ ఆప్స్ రేంజ్ కొంటా మార్గదర్శకత్వంలో రాజీవ్ కుమార్, కమాండెంట్ 151 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సమక్షంలో, బి/151 (ఎఫ్ఓబి వాటేవాగు) దళాలు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.ఛత్తీస్గఢ్లో మావోయిస్టు నెట్వర్క్లను నిర్మూలించి, అత్యంత ప్రభావిత జిల్లాల్లో శాంతిని పునరుద్ధరించేందుకు నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సీఆర్పీఎఫ్కు అప్పగించారు. నిరంతర ఆపరేషన్ల ద్వారా, ఈ దళం గతంలో మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాల్లో లోపలికి చొచ్చుకెళ్లి అనేక ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను (ఎఫ్ ఓ బి లు) ఏర్పాటు వేగవంతమైన ప్రతిచర్యకు వీలు కల్పించడంతో పాటు, తిరుగుబాటుదారుల బహిరంగ సంచారానికి, నియామకాలకు ఉన్న అవకాశాలను తగ్గించి మారుమూల అడవులలో జరిగిన ప్రధాన ఆపరేషన్ల ఫలితంగా కీలక నక్సల్ కమాండర్లను హతమార్చడం, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. దీనివల్ల గత రెండు దశాబ్దాలుగా తిరుగుబాటు గణనీయంగా బలహీనపడింది. ఈ ప్రయత్నాలు బృహత్తరమైన "నక్సల్ రహిత భారత్" వ్యూహంలో, దక్షిణ బస్తర్‌లోని ప మేడ్– కోర గుట్ట – వ టేవాగు– చుత్వాహి మార్గంలో 151 బెటాలియన్ సీఆర్పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తూ, మావోయిస్టు మౌలిక సదుపాయాలపై ఉమ్మడి ఒత్తిడిని కలుగజేస్తుంది. ఆపరేషన్లకు అతీతంగా, 151 బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు, అక్షరాస్యతా కార్యక్రమాలు, మొక్కల పెంపకం, క్రీడా సమావేశాలు మరియు నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి విస్తృతమైన పౌర కార్యాచరణ కార్యక్రమాలను (సి ఏ పీ ) నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాలకు కొనసాగింపుగా గురువారం బట్టిగూడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అక్కడ 151 బెటాలియన్ ఎస్ఎంఓ అయిన డాక్టర్ నీరజ్ పాండే 86 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మహిళలు, పిల్లలు ,వృద్ధుల ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అవసరాలను నేరుగా తీర్చడంతో పాటు, గ్రామస్థులు భద్రతా దళాల మధ్య నమ్మకాన్ని పెంచి, వారి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గింస్తున్నారు.ఈ కార్యక్రమాల ద్వారా, సీఆర్పీఎఫ్ స్థానిక అవగాహనను మెరుగుపరచడం ద్వారా సంఘ విద్రోహ శక్తులను అరికట్టడంలో సహాయపడటమే కాకుండా, యువతకు స్థానిక వర్గాలకు సాధికారత కల్పించి, రాష్ట్ర దీర్ఘకాలిక స్థిరత్వం అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తుంది. ఈ విధంగా ఛత్తీస్గఢ్‌లో సీఆర్పీఎఫ్ చేస్తున్న పని, మావోయిస్టు ల మూలాలను నిర్మూలించి, ఆ ప్రాంతంలో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడమే లక్ష్యంగా సాగే కఠినమైన నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు సున్నితమైన సంక్షేమ చర్యల సమతుల్య సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తుంది అని అధికారులు అన్నారు .ఈ కార్యక్రమానికి సెకండ్–ఇన్–కమాండ్ అయిన శ్రీ నితిన్ షిండే హాజరు కాగా, బి/151 అసిస్టెంట్ కమాండెంట్ , ఆఫీసర్ కమాండింగ్ అయిన శ్రీ మనీష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు

## ఆటో స్టాండ్ కు స్థలం కేటాయించండి

- ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేత



**చర్ల, మార్చ్ 20:(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలో ఆటో స్టాండ్ నిర్వహణకి స్థలం కేటాయించాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని అందుకుగాను బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ చర్ల మండల గణేష్ ఆటో యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం చర్ల మండలం ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి మద్దతు తెలిపిపారు . ఆటో యూనియన్ మండల అధ్యక్షులు పామరు బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ప్రమాదాలు జరిగినప్పుడు ఆటో డ్రైవర్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల కుటుంబాలతో పాటు ప్రయాణికుల సంక్షేమానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్ల ఉపాధి పూర్తిగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వం అనేక రకాలుగా టాక్స్ లను పెంచిందని ప్రభుత్వం పెంచిన టాక్స్ రద్దు చేయాలని పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. చర్ల మండల కేంద్రం రోజురోజుకీ విస్తరిస్తుందని ఈ విస్తరణ కనుగుణంగా చర్ల బస్టాండ్ సెంటర్లో ఇతర ప్రధాన సెంటర్లలో ఆటో స్టాండ్లు నిర్వహణకు స్థలాలు కేటాయించాలని నిరుపేదలైన ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మార్వో కి వినతి పత్రం అందచేశారు . ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ ఆటో యూనియన్ మండల కమిటీ సిఐటియు నాయకులు నాగరాజు, వెంకట్రావు, పోతురాజు, సతీష్,అశోక్ , తులసి, విజయ్, సంజీవ్ ప్రసాద్, సత్తిరాజు, సంపత్ ,వెంకటేష్, పవన్ కిషోర్, నరసింహారావు రాజు ప్రసాద్ పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులను మూసివేయాలి

- కుర్నపల్లి, ఎర్రబోరు గిరిజన మహిళల ఆందోళన



**చర్ల, మార్చ్ 20:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం కుర్నపల్లి పంచాయతీ పరిధిలో గల కుర్నపల్లి ఎర్రబోరు గ్రామాలలో గిరిజన మహిళలు కదం తొక్కి బెల్టు షాపులను నాటుసారా దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు మాట్లాడుతూ యువత గ్రామస్తులు మద్యానికి బానిసై కుటుంబాలను సర్వనాశనం చేస్తున్నారని ఇటువంటి మహమ్మారి మద్యాన్ని గ్రామాలలో విక్రయించొద్దంటూ మహిళలందరం కదం తొక్కి నాటు సారా దుకాణాలను బెల్టు షాపులను మూసివేయడం జరిగిందని వారు అన్నారు. ఊరి కట్టుబాట్లను కాదని ఎవరైనా బెల్ట్ షాపులను నాటుసారా ని అమ్మినట్లైతే అటువంటి వారు ఊరి కట్టుబాటు కు బాధ్యులు అవుతారని గిరిజన మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఘనంగా ఉగాది వేడుక





**చర్ల, మార్చ్ 20:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం తేగడ గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉగాది సంబరాలు ఘనంగా కమిటీ వారు గ్రామస్తులు సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉగాది పచ్చడి పంపిణీ చేయగా, భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ విశిష్టత

- **సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్**

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి20, ప్రజా జ్యోతి:** ప్రపంచ మంతా ముస్లిం సమాజం నిర్వహించుకునే పర్వదినం ఈదుల్ ఫిత్ర . దైవం ప్రసాదించిన అనుగ్రహాల్లో ఈదుల్ ఫిత్ర , ఈదుల్ అజ్హా ప్రధానమైనది, ఈపండుగలు తమ స్వభావం రిత్యా అన్నిపండుగలకన్నా ఉత్తమమైనవి. ఇస్లాం ప్రకారం ముస్లింలు జరుపుకుంటున్న ఈదుల్ ఫిత్ర మొదటిది. రెండవది ఈదుల్ అజ్హా. రంజాన్ ఉపవాసాలు తు.చ తప్పక పాటించమన్న దైవాదేశానికనుగుణంగా ముస్లింలు ఉపవాసాలు పాటించగలిగినందుకు, ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేయడానికి, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోడానికి ఈపండుగ జరుపుకుంటారు. ఎందుకంటే, దేవుడు మానవులకు అనేక మేలు చేశారు, రుజుమార్గం చూపాడు. ఏమార్గం మంచిది..ఏమార్గం చెడ్డది..మానవుల సాఫల్య వైఫల్యాలు ఎందులో ఉన్నాయి.. వారిఆధ్యాత్మిక, నైతిక, సామాజిక, సాంస్కృతిక, ఆర్ధిక, రాజకీయ రంగాలు ఎలా ఉండాలి.. ఏసూత్రాలు, నియమాలు పాటిస్తే జీవితం సార్ధకమవుతుంది..ఇత్యాది అనేక మార్గదర్శక సూత్రాలను నేర్పడానికే రంజాన్ నెలలో పవిత్ర ఖురాన్ గ్రంధాన్ని అవతరింపజేశాడు. ఇంతటి మహత్తర గ్రంథం అవతరించిన నెల ఎంత శుభప్రదమైనదో ప్రతి ఒక్కరు అర్ధం చేసుకోవచ్చు. అందుకే ముస్లింలు పండుగరోజు దేవుని దర్బారులో హాజరై, రంజాన్ మాసం లో ఉపవాసాలు పాటించే శక్తిని, సద్బుద్ధిని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు చెల్లించుకుంటారు. కేవలం దేవుని ప్రసన్నత పొందడానికి, పరలోకంలో సత్ఫలితాలు సాధించడానికి రంజాన్ నెలంతా పగటిపూట ఉపవాసాలు పాటించి, రాత్రివేళ తరావీహ్ నమాజుల్లో నిలబడి పవిత్ర ఖురాన్ వినగలగడం నిజంగా దైవానుగ్రహమే. దానికి ఆయనకు ఎంత కృతజ్ఞత చూపినా తక్కువే. ఈదుల్ ఫిత్ర దేవుని మన్నింపు లభించే శుభదినం. దాసుడు ఎలాంటి పరిస్థితిలోనైనాసరే పశ్చాత్తాప హృదయంతో ఆయన వైపుకు మళ్ళదలచుకుంటే దైవం అతణ్ణి తన కారుణ్యఛాయలోకి తీసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు. ఒక విషయం యదార్ధమని తెలిసినా దానికనుగుణంగా నడుచుకోడానికి చాలామంది ముందుకురారు. ఇదే మానవుల బలహీనత. దీన్ని అధిగమించడంలోనే విజ్ఞత దాగిఉంది. పుట్టిన ప్రతిమనిషీ గిట్టక తప్పదన్న విషయం ఎంతసత్యమో, ఈ అశాశ్విత మైన దేహం నుండి ఆత్మ ఎప్పుడు విడిచి వెళుతుందో కూడా ఎవరికీ తెలియదు. అందుకే ఆత్మజ్యోతి ఆరిపోకముందే జాగృతమై దైవం వైపుకు మరలాలి. తప్పులను, లోటుపాట్లను సరిదిద్దుకొని సన్మార్గంపైకి రావాలి. పండుగ రోజు తప్పులకు క్షమాపణ కోరుకునే రోజు. ఇకముందు తప్పులు చేయబోమని, సత్యమార్గంపై స్థిరంగా ఉంటామని దీక్ష వహించాల్సిన రోజు. కాబట్టి ఈనాటి ప్రార్ధన దైవం మనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేదై ఉండాలి. పండుగ శుభ సందర్భంగా ఈవిధంగా మనం సంకల్పం చేసుకుంటే అదే నిజమైన పండుగ అవుతుంది. మానవ జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే శుభదినం అవుతుంది. మానవుల్లో ఇలాంటి విలువలను, సుగుణాలను జనింపజేసే ఉపవాస వ్రతాన్ని పరాత్పరుడైన దైవం వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ మనోవాక్కాయ కర్మల ద్వారా త్రికరణశుద్ధిగా పాటించగలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతా పూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు. పండుగకంటే ముందు ఫిత్రాలు చెల్లిస్తారు. దీనివల్ల పేదసాదలుకూడా కొత్తబట్టలో, పండుగ సామగ్రో కొనుక్కునే అవకాశం కలుగుతుంది. ముస్లిములు, ముస్లిమేతరులు అన్నబేధభావం లేకుండా సమాజంలోని పేదసాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రంజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగవిలాసాలకు తమ ధనం వృధా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలిబాధలు అర్ధమవుతాయి. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటి వారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈవిధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతంవరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. ఈద్ రోజు ముస్లిములందరూ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారుచేసిన సేమియా పాయసాన్ని మిత్రులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్ 'అంటూశుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు. ఈవిధంగా ఈదుల్ ఫిత్ర పర్వదినం మనిషిని ఒక ఉన్నత మానవీయ విలువలు కలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదరభావాలకు పునాది వేస్తుంది. సమతా మమతలు బోధిస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర / రమజాన్ పర్వదిన పరమార్ధం.

## అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన రాష్ట్ర బడ్జెట్

- **కొత్వాల శ్రీనివాసరావు**



**పాల్వంచ, మార్చి 20, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, వ్యవసాయ మరియు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన బడ్జెట్ అని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు.రాష్ట్ర ఆర్ధిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వివిధ రంగాలకు కేటాయించిన నిధులపై కొత్వాల స్పందించారు.బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 23,179 కోట్లు కేటాయించడం ద్వారా రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న కట్టుబాటును స్పష్టంచేసిందన్నారు. విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో రూ. 26, 674 కోట్లు కేటాయించడాన్ని ఆయన అభినందించారు.అలాగే పంచాయతీ రాజ్ శాఖకు రూ. 33,688 కోట్లు, రోడ్లు–భవనాల శాఖకు రూ. 12,789 కోట్లు, మున్సిపల్ శాఖకు రూ. 17,907 కోట్లు, గృహ నిర్మాణ శాఖకు రూ. 7, 430 కోట్లు కేటాయించారని తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమాని కి రూ. 12,511 కోట్లు, షెడ్యూల్ కులాల అభివృద్ధికి రూ. 11,784 కోట్లు, షెడ్యూల్ తెగల అభివృద్ధికి రూ. 7,937 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ. 22, 615 కోట్లు కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపొందించిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి సమర్ధవంతంగా పరిపాలన సాగిస్తున్నదని కొత్వాల తెలిపారు.

## ఎండ తీవ్రత దృష్ట్యా పనివేళల్లో మార్పు

- **కూలీలకు సూచనలు**



**పాల్వంచ, మార్చి 20, ప్రజాజ్యోతి:** ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉదయం 6 గంటలకు పనిని ప్రారంభించి 11 గంటల వరకు మాత్రమే పనిచేయాలని ఏపీడీ రమణ సూచించారు. కేశవాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కుందేటి చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు.ప్రతి కూలీకి రోజుకు రూ. 307 వేతనం వచ్చేలా మార్కింగ్ ప్రకారం పనులు నిర్వహించాలని తెలిపారు. అలాగే పనికి వచ్చిన వెంటనే ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు నమోదు చేసి, నాలుగు గంటల తర్వాత మళ్లీ హాజరు నమోదు చేసిన అనంతరం మాత్రమే పనిని ముగించాలని సూచించారు.అనంతరం జగన్నాధపురం, కేశవాపురం గ్రామపంచాయతీలలోని నర్సరీలను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీవో పోరండ్ల రంగా, కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, వంశీకృష్ణ, క్షేత్ర సహాయకులు మాలోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాటోత్ ఠాణు నాయక్ 76వ వర్ధంతి

- **జాటోత్ ఠాణు నాయక్ పోరాటం ఆదర్శనీయం**



**టేకులపల్లి, మార్చి20, ప్రజాజ్యోతి :** గడిల పాలనకు వ్యతిరేకంగా విసునూర్ దేశముఖ్ దొరల పాలనకు,నిజాం నవాబు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణు నాయక్ చేసిన పోరాటం ఆదర్శనీయమని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భూక్య లాలు నాయక్ అన్నారు.శుక్రవారం టేకులపల్లి మండల కేంద్రంలో జాటోత్ ఠాణు నాయక్ 76వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లాలు నాయక్ మాట్లాడుతు భూమి కోసం, భుక్తి కోసం ఆయన చేసిన పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించింది.దొరల గడీలకు ఎదురు నిలబడి, వారి దౌర్జన్యాలను ప్రశ్నించిన ధైర్యవంతుడు ఆయన. ప్రజలలో స్వాభిమానం, పోరాట స్ఫూర్తిని పెంచిన నాయకుడు.1950 మార్చి 19న మొండ్రాయి గడిలో దొరలు ఆయనను క్రూరంగా హత్య చేశారు. కానీ ఆయన త్యాగం తెలంగాణ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి మండలం అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్, అజ్మీరా రమేష్, బానోత్ బద్రు నాయక్, దేవా, రాజు, అజ్మీరా గణేష్, ఇస్లావత్ చందా, భూక్యా దళ్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఘనంగా కోటికుంకుమార్చన మహాయాగం ప్రారంభం





**కొత్తగూడెం, మార్చి 20 ( ప్రజాజ్యోతి ):** కొత్తగూడెంలోని ప్రగతి నగర్‌లో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామివారి దేవాలయం లో కోటికుంకుమార్చన మహాయాగం శుభారంభమైంది. బ్రహ్మశ్రీ కొండవీటి దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన ఈ మహాయాగం ఉగాది నుండి శ్రీరామనవమి వరకు అనగా మార్చి 19 నుండి 28 వరకు కొనసాగనుంది. స్వస్తిశ్రీ చాంద్రమాన పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా నిర్వహిస్తున్న ఈ యాగం ద్వారా సమస్త ప్రజలకు సౌభాగ్యం, ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని సంకల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. పంచాయతన సహితంగా నిర్వహిస్తున్న ఈ కోటికుంకుమార్చన మహాయాగంలో ప్రత్యేక పూజలు, హోమాలు, ఆర్చనలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి, జగదాంబ అనుగ్రహం పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## కాంగ్రెస్ బడ్జెట్ రైతు పక్షపాత బడ్జెట్

- **పీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్**



**చర్ల, మార్చ్ 20: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై భద్రాచలం నియోజకవర్గ పీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భగా చర్ల మండల కాంగ్రెస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పునర్జీవనానికి పునాది వేసిందని రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడం పై దృష్టి పెట్టారని అందుకే డాంబికాలకు పోకుండా వాస్తవిక దృక్పథంతో బడ్జెట్ ను రూపొందించారని పేర్కొన్నారు.ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ శాఖ కు 23,179 కోట్ల రూపాయలు, విద్యుత్ శాఖ కు 21,285 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రు 7,430 కోట్లు, రాజీవ్ విద్య వికాస్ నికి రు 6000 వేల కోట్లు, వైద్య ఆరోగ్య శాఖ కు 13,674 కోట్లు ఎస్సీ, ఎస్టీ బీసీల సంక్షేమానికి పెద్ద యెత్తున నిధులు కేటాయించిన ప్రభుత్వం, 6 గ్యారంటీల అమలుకు పద్దులో అధిక మొత్తం కేటాయించారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా రూపుదిద్దుతుందని విద్య వైద్యం వ్యవసాయ సాగునీటి రంగాల అభ్యున్నతి సంక్షేమ అభివృద్ధిని సహకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది అని అన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపు దుర్గాప్రసాద్, చీమలమర్రి మురళీ కృష్ణ, ఇర్పా శ్రీనివాసరావు, ఆవుల విజయభాస్కర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంకెల గారడీతో మోసం చేసిన బడ్జెట్

- అన్ని వర్గాలను నిరాశపరిచింది
- కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో విఫలం
- బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ విమర్శ



**దమ్మపేట, మార్చ్. 20, (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ పూర్తిగా మోసపూరితమైందని, అంకెల గారడీతో అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు. మోసపూరిత గ్యారంటీలు, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా ప్రజల ఆశలను దెబ్బతీసిందన్నారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, రెండు లక్షల ఉద్యోగాలు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన రూ.20,000 కోట్లపై స్పష్టత లేకపోవడం ద్వారా బీసీల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. గత బడ్జెట్‌లలో నిధులు కేటాయించినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ముఖ్యంగా రాజీవ్ యువ వికాసం పథకానికి గత బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించినా అమలు కాలేదని, అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి కూడా నిధులు కేటాయించి వినియోగించలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నిలిపివేసి, ఇప్పుడు కొత్తగా ప్రారంభించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ దగాకోరు బడ్జెట్, పేదలను వంచించిన బడ్జెట్, ఆరు గ్యారంటీలను పాతరేసిన బడ్జెట్‌గా నిలిచిందని ఆరోపించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా, నిరుద్యోగులు, రైతులు, పేదలను మోసం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని దొడ్డా రమేష్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## శ్రీరాంపురం ఎస్టీ కాలనీ గుంపులో సీడీపీవో పర్యటన



**బూర్గంపహాడ్, మార్చి 20 (ప్రజాజ్యోతి ):** మండల పరిధిలోని సారపాక పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీ గుంపులో ఐసీడీఎస్ సీడీపీవో రేవతి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్టీకాలనీ గుంపులో చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శ్రీరాంపురం కాలనీలో అంగన్వాడీ సెంటర్ ఉండగా ఎస్టీ కాలనీ గుంపులో సెంటర్ లేకపోవడంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలంటే రెండు కిలోమీటర్ల వ్యత్యాసం ఉండటంతో అంగన్వాడీ సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నారు. ఈ సమస్య తెలుసుకున్న సీడీపీవో సూపర్వైజర్ సక్కుబాయితో కలిసి గుంపులో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. అంతేకాకుండా ఇప్పటికే ఇక్కడ నూతనంగా అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికే రెండు సార్లు ప్రతిపాదనలు ఇటు ఐటీడీఏ పీవో, అటు ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ఎస్టీ కాలనీ గుంపు పరిధిలో మొత్తం 65 కుటుంబాలు ఉండగా 265 మంది జనాభా ఉన్నారని, గర్భిణులు, బాలింతలు నలుగురు, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు 15 మంది ఉన్నట్లు తెలిపారు. ఎస్టీ కాలనీలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిన సౌకర్యాలను ఎస్టీ కాలనీ గుంపులో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సీడీపీవో తెలిపారు. త్వరలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వారికి సేవలు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సులోచన, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# యుద్ధం పేరుతో ....
# గ్యాస్ మాయజాలం

● గ్యాస్ దొరక్క వ్యాపారులు విలవిల ● గ్యాస్ కష్టాలు తీరేది ఎన్నడో? ● గ్యాస్ కొరతతో మూతపడుతున్న వ్యాపారులు ● ఇక కట్టెల పోయే ఆధారమంటూ కట్టెల పొయ్యికి సిద్ధమవుతున్న చిరు వ్యాపారులు ● గ్యాస్ లేకపోతే వ్యాపారాలు సాగేదెలా? ● వ్యాపారాలు మూతపడడంతో రోడ్డున పడుతున్న కూలీలు ● ప్రభుత్వం వ్యాపారులకు కమర్షియల్ గ్యాస్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటున్న వ్యాపారులు ● రేపటినుండి మూతపడనున్న చిరు వ్యాపారులు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లు ● బుకింగ్ ద్వారా గృహాల నుండి గ్యాస్ దొరికితే 2000 పై మాటే ● ఇక గ్యాస్ కు బై బై కట్టెల పొయ్యికి జై జై అంటున్నా వ్యాపారులు

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 20 ,ప్రజాజ్యోతి:** యుద్ధం పేరుతో గ్యాస్ దొరక్క చిరు _ బడా వ్యాపారుల సైతం విలవిల లాడుతున్నారు, నిన్న మొన్నటి వరకు ఏదో ఒక రకంగా, ఏదో ఒక కంపెనీకి చెందిన గ్యాస్ సిలిండర్లను ఉపయోగించుకుని తమ తమ వ్యాపారాలను కొనసాగించుకుంటున్నారు, గత వారం రోజుల నుండి డొమెస్టిక్ సిలిండర్లు కానీ, కమర్షియల్ సిలిండర్లు కానీ సరఫరా లేకపోవడంతో చిరు వ్యాపారం నుండి, పెద్ద రెస్టారెంట్ల వరకు, అదేవిధంగా కర్రీ పాయింట్లు సైతం మూతపడే పరిస్థితికి వచ్చింది, గ్యాస్ కోసం గృహ యజమానులు బుక్ చేసుకున్న సిలిండర్ను 2 వేల నుంచి 3 వేల వరకు ఇతరులకు విక్రయిస్తున్నట్లు సమాచారం, ఇక ప్రస్తుతం గృహ యజమానులు కూడా వ్యాపారులకు ఇచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు, ప్రభుత్వ అధికారులు మాత్రం గ్యాస్ కొరత లేదని, ఎలాంటి అపోహాలకు పోవద్దని చెబుతున్నప్పటికీ గ్యాస్ కొరత కొంత కనబడుతున్నట్లు ఉంది, వ్యాపారులకు మాత్రం కనీసం కమర్షియల్ సిలిండర్లు కూడా సరఫరా లేకపోవడంతో వ్యాపారాలు మూతబడుతుండటంతో హోటల్లో, రెస్టారెంట్లలో, కర్రీ పాయింట్లలో పనిచేసే కూలీలు సైతం రోడ్డున పడే పరిస్థితి నేడు నెలకొంది, ఇప్పటివరకు కాస్త అక్కడక్కడ దొరికిన గ్యాస్ సిలిండర్ ను ఉపయోగించుకొని ఇప్పటివరకు పూర్తిస్థాయిలో వంటలు తయారు చేయకుండా కొన్ని ఐటమ్స్ మాత్రమే తయారుచేసి కస్టమర్లకు అందించి వ్యాపారాలు కొనసాగించారు

కానీ నేటినుండి ఎక్కడ గ్యాస్ దొరక్క పోవడంతో వ్యాపారాలు మూసివేసే పరిస్థితికి వచ్చిందని పలువురు రెస్టారెంట్ల యజమానులు, కర్రీ యజమానులు, హోటల్ యజమానులు వాపోతున్నారు, ఇక కట్టెలపొయ్యే శరణ్యమంటూ కొంతమంది వ్యాపారులు ఇప్పటికే కట్టెల పొయ్యిలను సిద్ధం చేసుకోవడం కనిపిస్తుంది ,కానీ అన్ని రకాల వంటలు రెస్టారెంట్లలో తయారు చేసుకోలేమని, కొన్ని మాత్రమే గ్యాస్ పొయ్యిలపై చేయాల్సి ఉంటుందంటున్నారు, ఇదిలా ఉండగా ఇండక్షన్ పొయ్యిలు కానీ ,లేక ఎలక్ట్రికల్ పొయ్యిలను తీసుకొచ్చి వాటిపై వంటకాలు తయారు చేద్దామంటే వాటితో ప్రమాదకరంగా ఉంటుందని కొంతమంది భావిస్తున్నారు, గ్యాస్ దొరక్క పోవడంతో కట్టెల పొయ్యి తయారుచేసుకొని వంటలు తయారు చేద్దాం అని అనుకున్నప్పటికీ కట్టెల కూడా దొరికే పరిస్థితి కనబడటం లేదు, ఒకవేళ కట్టెలు తీసుకుందాం అన్నా కూడా సైకిల్ పై కట్టెలు అమ్మే గిరిజనుల వద్ద నుండి తీసుకున్న కట్టెలు కూడా ఒక సైకిల్ మోపు రూ 8 వందల నుండి వెయ్యి రూపాయల వరకు విక్రయిస్తున్నారు, వ్యాపారులకు గ్యాస్ కొరత ఉందని తెలుసుకున్న కట్టెల వ్యాపారులు కూడా ఇదే అదునుగా భావించి వారు కూడా గ్యాస్ సిలిండర్ ధర కంటే ఎక్కువ చెబుతుండడం కనిపిస్తుంది,

ఒకవైపు గ్యాస్ సిలిండర్లు దొరక్క మరోవైపు కట్టెల ధరలు కూడా విపరీతంగా పెంచడంతో చీరు వ్యాపారాలు, రెస్టారెంట్లు కర్రీ పాయింట్ల వ్యాపారాలు సాగేదెలా అని పలువురు వ్యాపారాలు వాపోతున్నారు, వ్యాపారాలు మూతపడడంతో హోటల్ లో పనిచేసే కూలీలు పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది, ఇది ఇలా ఉండగా ఏప్రిల్, మే ,జూన్ నెలలో అనేక శుభకార్యాలు ఉండడంతో గ్యాస్ కొరతతో శుభకార్యాల నిర్వాహకులు కూడా ఆందోళన చెందుతున్నారు, కావున ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, గ్యాస్ సివిల్ సప్లై అధికారులు స్పందించి చిరు వ్యాపారులకు, రెస్టారెంట్లకు ,కర్రీ పాయింట్లకు కమర్షియల్ సిలిండర్లను ఏర్పాటు చేయాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు కరోనా సమయంలోనైనా అన్ని దొరికి ఇంట్లో అయినా కూర్చొని తినగలిగాము కానీ యుద్ధం కారణంగా ప్రస్తుతం గ్యాస్ దొరక్క తిను బండారులకు సంబంధించిన వ్యాపారాలు మూతపడుతుండటంతో బయట చిన్నచిన్న హోటల్స్ లో కానీ, రెస్టారెంట్లో కానీ ఎక్కడ ఏమి దొరికే పరిసితి లేదనిపిస్తుందని పలువురు ప్రజలు చర్చించుకోవడం వినిపిస్తుంది,

ప్రస్తుతం గ్యాస్ పరిస్థితి ఎలా ఉందంటే అదిగో పులి ఇదిగో తోక అన్నసందంగా ఇక గ్యాస్ కొరత లేదని, గ్యాస్ ఇతర దేశాల నుండి మన దేశానికి సముద్రం ద్వారా గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయంటూ అనటమే కానీ ఇక్కడ మాత్రం గ్యాస్ దొరక్క అనేకమంది ప్రజలు విలువలాడుతున్నారు, ఎక్కడ విన్న ఎవరి నోట విన్న గ్యాస్ దొరకడం లేదు అనే చర్చ కొనసాగుతుంది, కావున ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు చిరు వ్యాపారులను, రెస్టారెంట్ల ,కర్రీ పాయింట్ల వ్యాపారాలను, ఇతర వ్యాపారాలను దృష్టిలో పెట్టుకుని కమర్షియల్ సిలిండర్లు అయినా సరఫరా చేసి గ్యాస్ పై ఆధారపడే వ్యాపారస్తులను ఆదుకోవాలని పలువురు వ్యాపారులు అధికారులను వేడుకుంటున్నారు





# రియల్టర్ల అహంకారానికి హద్దులే లేవా...?

- అక్రమ వెంచర్ పై వార్తలు రాస్తేవి లేఖర్లను అడ్రస్ లేకుండా చేస్తామని బెదిరింపులు
- చిట్టిరామవరం సర్వే నెంబర్ 20లో ఉద్రిక్త పరిస్థితి
- 19వ డివిజన్‌లో 9 ఎకరాల వ్యవసాయ భూమిలో వెంచర్ ఏర్పాటుకు రంగం సిద్ధం
- కార్పొరేటర్ భర్త అండతో రియల్టర్ ఆర్.కె దూకుడు ప్రవర్తన
- ప్రజాస్వామ్యాన్ని సవాల్ చేస్తున్న రియల్ మాఫియా
- అధికారుల మౌనంతో కార్పొరేషన్‌లో చర్చనీయాంశమైన ఘటన
- అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి ఘటనలు పెరిగే అవకాశాలు ఉన్నాయా ...?

**కొత్తగూడెం, మార్చి 20 ( ప్రజాజ్యోతి )** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లో వెలుగులోకి వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా చిట్టిరామవరం పరిధిలోని సర్వే నెంబర్ 20లో జరుగుతున్న వెంచర్‌పై సందేహాలు వ్యక్తమవుతుండగా ఈ వ్యవహారంపై సమాచారం సేకరించేందుకు వెళ్లిన విలేకర్లను రియల్టర్లు బెదిరించడం వివాదాస్పదంగా మారింది. స్థానిక వర్గాల సమాచారం మేరకు వ్యవసాయ భూమిగా నమోదైన ఈ భూభాగంలో కొందరు రాజకీయ అనుబంధాలు ఉన్న వ్యక్తులు కలిసి ప్లాట్లుగా విభజించి వెంచర్ చేపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ వెంచర్‌కు సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకున్నారా లేదా అన్న విషయంపై స్పష్టత లేకపోవడంతో కొన్ని పత్రికల్లో కథనాలు వెలువడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వార్తలు రాసిన విలేకరిపై ఆర్.కె అనే రియల్టర్ మరియు అతని అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. మా వెంచర్ జోలికి వస్తే మంచిది కాదని, వార్తలు రాసేముందు ఆలోచించాలంటూ హెచ్చరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తమకు ఉన్న నెట్‌వర్క్‌ను ప్రస్తావిస్తూ విలేకర్లపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఈ వ్యవహారంలో స్థానిక కార్పొరేటర్ కుటుంబ సభ్యుల అండతో పాటు కొంతమంది అధికారుల మద్దతు కూడా ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ కారణంగానే రియల్టర్లు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› అగ్రికల్చర్ భూమి ప్లాట్లుగా విభజించడానికి అనుమతులపై అనుమానాలు

19వ డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 20లో ఉన్న 9 ఎకరాల వ్యవసాయ భూమిని వెంచర్‌గా మార్చేందుకు అవసరమైన అనుమతులు తీసుకున్నారా? ల్యాండ్ యూజ్ మార్పు జరిగిందా? స్థానిక సంస్థల అనుమతులు ఉన్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు అమాయక ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత నిర్మాణానికి అనుమతులు రాకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ వెంచర్లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుతున్నారు.

### ››› ప్రజాస్వామ్యాన్ని సవాల్ చేస్తూ మీడియాను టార్గెట్ చేస్తున్నారా?

వాస్తవాలు బయటపడుతాయన్న భయంతోనే విలేకర్లపై ఒత్తిడి, బెదిరింపులకు దిగుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మీడియా స్వేచ్ఛపై నేరుగా దాడిగా పరిగణించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బెదిరింపుల ద్వారా వార్తలను అడ్డుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని వారు హెచ్చరిస్తున్నారు.

### ››› అధికారుల మౌనం ఎందుకు?

ఈ ఘటనపై ఇప్పటివరకు అధికార యంత్రాంగం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విలేకర్లకు బహిరంగంగా హెచ్చరికలు జారీ అవుతున్నా చర్యలు లేకపోవడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. స్థానికులు మాత్రం పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలు వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. బెదిరింపులతో నిజాలను అడ్డుకోవడం సాధ్యం కాదని వాస్తవాలు వెలుగులోకి రావాల్సిందేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు నిజాలు తెలియాల్సిందేనని అంటున్నారు.




## నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నల్లా సురేష్ రెడ్డి






**పాల్వంచ, మార్చి 20, ప్రజాజ్యోతి:** శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలోని బసవతారక కాలనీ జగన్నాధపురం, శ్రీనివాస కాలనీ లతో పాటు సుజాత నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం ముస్లిం సోదర సోదరీమణులకు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారని తెలిపారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దానధర్మాలు ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొంటూ, అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో సోదరభావం, పరస్పర సహకారం పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పండుగ సందర్భంగా పేద కుటుంబాలు సంతోషంగా జరుపుకునేలా నిత్యావసర సరుకులు అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.పాల్వంచ శ్రీనివాస కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో కూడా తాము భాగస్వాములమయ్యామని గుర్తు చేస్తూ, మత సామరస్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## రేపు జిల్లా స్థాయిలో ఎంసెట్ మోడల్ పరీక్ష



**బూర్గంపహాడ్, మార్చి 20 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని సారపాకలో బ్రిలియంట్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి గాను ఎంసెట్ పరీక్ష రాసే విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించేందుకు ఆదివారం బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ఎంసెట్ మోడల్ పరీక్షను జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థ చైర్మన్ బీఎస్ఆర్ శుక్రవారం తెలిపారు. అ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మోడల్ పరీక్షలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన వారికి ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మోడల్ ఎంసెట్ పరీక్ష రాసే విద్యార్థులు ఒకరోజు ముందుగా పేర్లను బ్రిలియంట్ కళాశాలలో నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9705137128, 9866283566లను సంప్రదించాలని కోరారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కోరం సురేందర్



**టేకుల పల్లి, మార్చి 20, ప్రజాజ్యోతి :** మండలంలోని కొప్పురాయి గ్రామ పంచాయతీ పరిధిలో గల రాజారాం తండా, మోదుల గూడెం గ్రామాలలో గురువారం సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఇల్లందు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్, గ్రామస్తులకు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ పలు సూచనలు చేశారు.ఈ కార్యాక్రమం లో వెంకటేష్,సర్పంచ్ చింత కళ్యాణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జరా సమ్మక్క, వార్డు మెంబెర్ జరుపుల శంకర్, బొప్పన సుబ్బారావు, భూక్యా సర్దార్,గుగులోత్ రమేష్, పూనెం వెంకట్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో అస్తవ్యస్తమైన సైడ్ కాలువలు

- త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని నూతన సర్పంచ్ హామీ





**అశ్వాపల్లి. మార్చి 20.(ప్రజాజ్యోతి)**అశ్వాపల్లి మండల పరిధిలో మర్కోడు పంచాయతీ లో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.ఊరికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక సైడ్ కాలువలు పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు రోడ్లపైకి, ఇళ్ల ముందు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు. స్థానిక సర్పంచ్ కి ప్రజా జ్యోతి. రిపోర్టర్ చరవాణి లో వివరించగా స్పందించిన సర్పంచ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని గమనించి. మురుగునీరు నిలిచిన ప్రాంతాలను తక్షణమే నీరు వెళ్లేలా తాత్కాలికంగా పూడికతీత పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు."దశాబ్దాలుగా ఉన్న ఈ డ్రైనేజీ సమస్యను పరిష్కరించడమే మా ప్రథమ ప్రాధాన్యత అని అకాల వర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు పునరావృతం కాకుండా త్వరలోనే గ్రామ నిధులతో లేదా ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా ఆధునిక పద్ధతిలో సైడ్ కాలువల నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమం ముప్పిడి రాంబాబు. మన్యం సుబ్బారావు. దొడ్డి రాము. అనుమోల వెంకన్న. అఖిల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ముందు వరుసలో నిలుస్తున్న ఎక్సలెంట్ భాషా హై స్కూల్

- బుధవారం నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్ లో 17 ర్యాంక్
- నేడు జాతీయ ఇన్ స్పైర్ అవార్డుకు మరో విద్యార్థిని ఎంపిక...



**పినపాక,మార్చి 20(ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఇ.బయ్యారం లో గల ఎక్స్ లెంట్ భాష హై స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న జి. గీతిక రూపొందించిన "కొండ ప్రాంతాలలో సురక్షిత ప్రయాణం"(సేఫ్ జర్నీ ఎట్ ఘాట్ రోడ్డు )అను వినూత్న ఆలోచనకు గాను జాతీయ స్థాయిలో ఇన్స్ పైర్ అవార్డు _ మనక్,2026 కు ఎంపికైనట్లు ఎక్స్ లెంట్ విద్యాసంస్థల (ఎక్స్ లెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్) చైర్మన్ యూసఫ్ షరీఫ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైనందుకు విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎక్స్ లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ.... పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో సైన్స్, పరిశోధన మరియు ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి భారత ప్రభుత్వం ఇన్స్ పైర్ అవార్డు _ మనక్ అనే బృహత్తర కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమం మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులలోని నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.జాతీయ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఆలోచనల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం రూ.10,000 ల నగదు పురస్కారం ఇవ్వడంతో పాటు జిల్లా, రాష్ట్ర మరియు జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనలలో పాల్గొనే అవకాశం కల్పిస్తుందని అన్నారు.ప్రతి సంవత్సరం ఇన్స్ పైర్ అవార్డు మనక్ కు ఎక్స్ లెంట్ విద్యా సంస్థల , విద్యార్థిని విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.తాజాగా వెలువడిన నవోదయ ఎంట్రన్స్ టెస్ట్ లో 17వ ర్యాంకు సొంతం చేసుకున్న ఎక్సలెంట్ నేడు జాతీయ స్థాయిలో మరొక విద్యార్థిని ఎంపిక కావడం పట్ల ఎక్సలెంట్ భాషా హై స్కూల్ యాజమాన్యానికి తల్లిదండ్రులు,మండల ప్రజలు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి ఈ కార్యక్రమంలో ఎక్స్ లెంట్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఖాదర్ షరీఫ్, యాకూబ్ షరీఫ్,ముక్కు నరసారెడ్డి బందారు నరేంద్ర, ప్రిన్సిపల్ అంకం సురేష్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగలా ఉగాది నగార సంబరాలు

- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు






**చర్ల, మార్చి 20:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గురువారం ఉగాది పండుగను పురస్కరించుకొని ఉగాది నగార సంబరాలను నిర్వహించారు. నగార సాంస్కృతిక సేవా సంస్థ బాధ్యుదు జవ్వాది రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక కడెం వారి సురేష్ ఆర్ట్స్ ఓపెన్ థియేటర్ – చింతలచెరువు వెంకట సుబ్బయ్య కళాప్రాంగనం ఆవరణలో గురువారం రాత్రి జరిగిన ఉగాది వేడుకలో బాగంగా పంచాంగ శ్రవణం నిర్వహించగా పంచాంగ శ్రవణంలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం – శ్రీకాంత్, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు – సరోజిని దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు విశ్వనాథ శర్మ మాట్లాడుతూ శ్రీ పరాభవ నామ సంవత్సరం అంటే చెడు జరుగుతుందని అర్థంకాదని, పరాభవ అంటే శక్తి స్వరూపిని అని అర్థమన్నారు. పార్వతీ పరమేశ్వరులు ఈ సంవత్సరానికి అదిపతులని పేర్కొన్నారు. ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. అనంతరం జరిగిన ఉగాది సంబరాలలో శ్రీ వాణి విద్యానికేతన్, గురుదేవ్ విద్యాలయం, రాహుల్ విద్యాలయం, జి ఎస్ శాంతినికేతన్, చర్ల బాలురు , బాలికల, తేగడ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. విద్యార్థులు ఒకరికొకరు పోటీలు పడి శాస్త్రీయ, జానపద, సినీ గీతాలకు నృత్యాలు చేస్తూ తమ సత్తా చాటుకున్నారు. ఆయా పాఠశాలలకు చెందిన ఎల్ కే జి, యూకేజీ చిన్నారులు వందలమంది ప్రేక్షకుల ఎదుట బెరుకులేకుండా హావభావాలను పండించి నృత్యాలతో అందరిని ఆకట్టుకున్నారు . అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన వారికి ఘన సన్మానం చేసారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అహర్నిశలు కృషిచేస్తున్న సిఐ రాజు వర్మ, వ్యవసాయరంగంలో రాణిస్తున్న నేదూరి సత్యనారాయణ, గుమ్మల వీరన్న, మహిళా రైతు కొమ్మినేని వెంకటరమణ, సామాజికవేత్త షేక్ షాజహాన్, కళారంగ ప్రముఖులు బండి చిన్న రాములను కమిటి సభ్యులు శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందచేసి ఘనంగా సన్మానించారు. ఎస్ ఐ లు నర్సిరెడ్డి, కేశవ్ లను శాలువాతో సత్కరించారు. ఉగాది సందర్భంగా మహిళల ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి డి సమత రూ. 5 వేల నగదును, ద్వితీయ బహుమతి జ్యోతి రూ. 3 వేల నగదును, తృతీయ బహుమతిగా నందిని రూ. 2 వేల నగదును గెలుచుకోగా సావిత్రి, పద్మిని, లలిత లు తలా వెయ్యి రూపాయల నగదును కన్సోలేషన్ బహుమతులుగా అందుకున్నారు. ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణేతలుగా శ్రీ వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ మైనేని పద్మజ, బందా స్వరూపారాణి, ప్రసన్నకుమారిలు వ్యవహరించారు. చర్ల చరిత్రలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ఉగాది సంబరాలను నిర్వహించిన కమిటి సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అవుల విజయభాస్కర్‌రెడ్డి, కమిటి సభ్యులు జవ్వాది రవికుమార్, ఇర్రంకి ఉదయ ప్రభాకర్, తడికెల లాలయ్య, సుందర పెద్దిరాజు, సి హెచ్ వీరభద్రం, మేడిచర్ల వీరకుమార్, కోట రత్నాజి,గూడపాటి సతీష్, తడికెల నరేష్, తాండవ రాయుడు, కాకర్ల కుమార్, ముత్యాల సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో సత్తా చాటిన రాధిక స్కూల్ విద్యార్థి

- పాఠశాల యాజమాన్యం నుంచి ఘన సత్కారం



**పినపాక,మార్చి 20(ప్రజాజ్యోతి)** 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నవోదయ ప్రవేశ పరీక్షల్లో రాధిక కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన గగనాగి జస్వంత్ గౌడ్ 90 మార్కులు సాధించి నవోదయ పాఠశాలలో సీటును సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపింది.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. పాఠశాలలో సిబిఎస్ఈ తరహాలో బోధన అందించడం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. పోటీ తత్వం పెంపొందించుకోవడం ద్వారా కాంపిటీటివ్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ విజయం సాధించడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ అండ్ డైరెక్టర్ సిహెచ్ జయసింహారెడ్డి, డైరెక్టర్ సంపత్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాజీమన్ వర్మ, ఇంచార్జ్ టీచర్ హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## కెఓసిలో రోడ్డు క్లీనింగ్ మిషన్ ను అడ్డుకున్న కాంట్రాక్టు కార్మికులు



**టేకులపల్లి,మార్చి 20,ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా కెఓసిలో ఎఐటియుసి గుర్తింపు సంఘం,ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియుసి ల ఆధ్వర్యంలో స్థానిక ఓసిలో రోడ్డు క్లీనింగ్ మిషన్ ను పనులు చేయనీయకుండా నాయకులు కాంట్రాక్టు కార్మికులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా గుర్తింపు సంఘం బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు,ప్రాతినిధ్య సంఘం కోసూరి సత్యనారాయణ లు మాట్లాడుతూ 2002 కెఓసీ ప్రారంభం నుంచి పనిచేస్తున్న సుమారు 23 మంది హౌస్ కీపింగ్, సివిల్ సంబంధించిన కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తు కుటుంబాలను పోషించుకుంటు జీవిస్తున్న వారి కుటుంబాల్లో చీకట్లు అలుముకున్నాయాని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అకస్మాత్తుగా యాజమాన్యం రోడ్డు క్లీనింగ్ మిషన్ తెచ్చి 16 మంది కార్మికుల కుటుంబను రోడ్డు పాలుచేసారని వారు ఆరోపించారు. 22 సంవత్సరాలుగా కెఓసిలో పనిని నమ్ముకుని జీవిస్తున్న కార్మికులు నేడు యాజమాన్యం నిర్లక్ష్యం గా పనిని నుంచి తొలగించడం సరికాదని వారు అన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి రోడ్డు క్లీనింగ్ మిషన్ తొలగించి పనుల నుంచి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.లేని పక్షంలో కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉండి రోడ్డు క్లీనింగ్ మిషన్ తొలగించే వరకు తమ ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమం లో సైదులు,ఎర్ర బాలు,సత్యనారాయణ,రామ్ కూ మార్,మంగియ్యా,బాలు, రాంచందర్, శివ,రాజశేఖర్, అవినాష్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.